**కథ**

# రౌతు

కె.కె.భాగ్యశ్రీ

"ఒరేయ్ వెధవా! జెటిక్స్ పెట్టరా" గేటు తెరవబోతున్న నర్మద చిన్నవాడి పెనుకేకకి ఉలిక్కిపడింది.

"ఎప్పుడూ జెటిక్సేనేంట్రా దరిద్రుడా. నేను క్రికెట్టే పెడతాను. తానేమీ తీసిపోనన్నట్లుగా గట్టిగా అరిచాడు పెద్దవాడు.

గుండెలవిసిపోయాయి నర్మదకు. లోపలికి అడుగు పెట్టాలంటే శత్రు శిబిరంలోకి ప్రవేశించాలన్నంత దడ మొదలైంది.

వాలి, సుగ్రీవులకు వారసుల్లా తన్నుకు చచ్చే సుపుత్రులు, గడపకడ్డంగా విడిచిపెట్టిన షూస్, మూల మూలలంట విసిరిపారేసిన స్కూల్ యూనిఫామ్‌లు సాక్స్‌లు, కాళ్లల్లో కర్ర పెట్టినట్లుగా అడ్డదిడ్డంగా పడేసిన స్కూల్ బ్యాగ్‌లు, అందులోంచి తొంగి చూసే పుస్తకాలు, క్యారేజ్ పట్టుకెళ్లే బాస్కెట్స్‌లోంచి నిర్దాక్షిణ్యంగా నెట్టివేయబడి నేలపై దొర్లుతున్న వాటర్ బాటిల్స్...

హాల్ చూస్తే అస్తవ్యస్త చిత్రంలా ఉంటుంది.

వంటగది సంగతే వేరు. సింక్ నిండా ఎంగిలి ప్లేట్స్, గ్లాస్‌లు, గిన్నెలు. అలమరలో మూత సగం తీసి ఉన్న పంచదార డబ్బాలోకి క్రమశిక్షణతో కవాతు చేస్తున్న వీర సైనికుల్లా వరుసగా ప్రయాణిస్తున్న చీమల బారులు, మూత పూర్తిగా తెరిచిన బూస్ట్‌సీసా గట్టిపడుతూ, గడ్డకట్టే స్థితికి చేరుకుంటున్న బూస్ట్, రేపర్ విప్పదీసి వదిలేస్తే, గాలి బారిపోయి మెత్తబడిన బిస్కట్స్..

పడకగది పరిస్థితి ప్రత్యేకం. గది నిండా చిందరవందరగా జల్లేసిన బట్టలు, తలగడ మీద పొద్దున్నే భర్తగారు స్నానం చేసొచ్చి తల తుడుచుకుని ఉండగా చుట్టి విసిరేసిన తడి తువ్వాలు, ఆ చెమ్మనంతా పీల్చుకుని ముక్కు వాసన కొడుతున్న దిండు గలేబు... ఇంకా వర్ణించవలసి కానంత విచిత్రమైన సన్నివేశాలు.

ఈ పరిస్థితినంతా చక్కదిద్ది ఇంటినో కొలిక్కి తేవడానికి ఒక మహా సంగ్రామం చేసినంత పనవుతుంది నర్మదకు.

'ఛీ...ఛీ.. ఈ ఇంటిని, తన పిల్లల్ని, భర్తను మార్చడం తన వలన కాదు' ఆమె అలా తలపోయడం ఏ వెయ్యోసారో!

తనూ వాళ్ల లాంటి మనిషేననీ, తనకి కూడా పరిమితమైన శక్తి మాత్రమే ఉంటుందని గుర్తించరెందుకు?

ఇంటి పనుల్లో సహాయం చేయడం మాట దేవుడెరుగు కంగాళీ చేయకుండా ఉంటే అదే పదివేలు.

తనేం చెప్పబోయినా సరే "అమ్మా!" అంటూ విసుగ్గా చూస్తారు పిల్లలు. తను పడుతున్న శ్రమను అర్థం చేసుకోకపోయేందుకు వారు మరీ పసిపిల్లలేం కాదు. పోనీ వాళ్లు తెలియనితనంతో వ్యవహరిస్తున్నారని సరిపెట్టుకుంటుంది. కానీ సుధీర్‌కేమైంది?

ఉద్యోగస్తురాలైన ఇల్లాలు, ఇంట బయట ఎంత చాకిరీతో సతమతమవుతుందో అతడికి తెలియదా!

"అబ్బ! నర్మదా ఇంటికి రాగానే ఏంటి నీ సోది! అక్కడతో ఆపేయి" అని చిరాగ్గా కసురుకుంటాడు.

తండ్రి బాధ్యతారహితంగా ప్రవర్తిస్తూ ఉంటే పిల్లలు అతడి అడుగుజాడలలోనే నడుస్తున్నారు.

ఇంట్లో సమస్యలు ఇలా ఉంటే ఆఫీస్‌లో మరొక రకం.

పది నిమిషాలు ఆలస్యమైనా సరే, ఆఫ్ డే లీవ్ మార్క్ చేసి పారేస్తుందా చండశాసనురాలైన అధికారిణి.

ఒక స్త్రీ అయి ఉండి సాటి ఆడదానిని సానుభూతితో అర్థం చేసుకోవడం మాట అటుంచి నానా మాటలు అంటుంది.

నిన్న పావుగంట లేటైందని రూమ్‌లోకి పిలిచి తల వాచేలా చీవాట్లు పెట్టింది.

"చూడండి నర్మదగారూ సమయపాలన ఖచ్చితంగా పాటించని వారంటే నాకు చాలా కోపం" అంది గంభీరంగా.

తన హృదయం కలుక్కుమంది. "మీకు తెలియనిదేముంది మేడమ్. ఆడవాళ్లకి ఇంటి పనులు తెముల్చుకుని రావడం ఎంత కష్టమో!"

"నో...నో కుంటిసాకులు చెప్పకండి. అవన్నీ అందరికీ ఉండేవే. నేను కరెక్ట్ టైమ్‌కి రావడం లేదూ. మరోసారి నా చేత చెప్పించుకోకండి. ఇన్‌టైమ్‌లో ఆఫీస్‌కి రాలేకపోతే ఉద్యోగం మానేసి ఇంట్లో కూర్చోండి" వార్నింగ్ ఇచ్చి ఫైల్‌లోకి బుర్రదూర్చింది లేడీ బాస్.

ఎంత అష్టావధానం చేసినా ఆఫీస్‌కి టైమ్‌లో చేరుకోలేకపోతోంది. అలాగని ఆవిడ అనే మాటలూ భరించలేకపోతోంది.

నిన్నటి సంఘటన జ్ఞప్తికి రాగానే గుండెకయిన గాయం తిరిగి సలపడం ప్రారంభించింది ఆమెకు.

ఎంత నీట్‌గా సర్దినా సాయంత్రంకల్లా కిష్కింధలా తయారయ్యే ఇంటినీ, కాట్లకుక్కల్లా కలియబడి పోట్లాడుకునే ఈ మగపిల్లల్ని సందడించడం ఎంత కష్టతరమైన కార్యక్రమమో ఆవిడ కలలోనన్నా ఊహించలేదు.

ఇన్ని ఈతిబాధల మధ్యన తనని పట్టించుకోవడం లేదని గునిసే భర్తగారి అలకలు తీర్చడం ఒకటి.

"అమ్మా..ఆకలీ.." సునీల్ మాటలకు ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చిన నర్మద, చకచక కొంగు బిగించి కార్యరంగంలోకి దూకింది.

వంట చేసి పిల్లలకి పెట్టి సుధీర్ కోసం ఎదురు చూస్తూ కూర్చుంది.

నగరం నడిబొడ్డునున్న మూడు లాంతర్ల జంక్షన్‌లో మిత్రబృందంతో కుచ్చుటప్పాలు కొట్టి కొట్టి ఇంటికొచ్చాడు అతగాడు.

అతగాడికి భోజనం పెట్టి ఇల్లు సర్దుకొని మర్నాటి ఉదయం వంట కోసం అన్నీ సిద్ధం చేసుకుని పడక చేరేసరికి పదిన్నరైంది.

పగలంతా అలసిసొలసిన శరీరం విశ్రాంతిని కోరుకుంటోంది. పక్క చూడగానే నిద్రముంచుకొచ్చింది.

"ఏంటీ శ్రీమతిగారు అప్పుడే ముసుగుతన్నారు" ఆమె సరసన చేరి తన వైపు తిప్పుకునే ప్రయత్నం చేశాడు సుధీర్.

"ప్లీజ్ నాకు నిద్రొస్తోంది" అంది అతడిని విడిపించుకుంటూ.

అంతే... ఛర్రున కోపం ముంచుకొచ్చింది అతడికి.

"నీకెప్పుడూ నిద్ర గోలే. ఈమధ్య జడపదార్థంలా తయారయ్యావు" విసుగ్గా అంటూ ఆమెను వదిలి పక్కకు తిరిగి పడుకున్నాడు సుధీర్.

భార్య తనని సుఖపెట్టాలని ఆశించే ఈ పురుషపుంగవులు, తమకూ ఆమె కష్టసుఖాలను కనిపెట్టి ఆమెకు సంతోషాన్ని పంచిపెట్టే బాధ్యత ఒకటుందని ఎందుకు విస్మరిస్తారు?

అదొక మిలియన్ డాలర్ల ప్రశ్నలాగే అనిపిస్తుంది నర్మదకు.

ooo

"సునీల్..వినీల్"

వాషింగ్‌మిషన్‌లో ఉతికిన బట్టల్ని డాబాపైన ఆరవేసి వస్తున్న నర్మద పిలిచింది భోజనాలకి ఏర్పాట్లు చేస్తూ.

ఎక్కడా ఎవరూ పలకలేదు.

వారమంతా మిగిలిపోయిన అదనపు పనుల్ని పూర్తి చేసుకునేందుకు ఆదివారం నాడే అవకాశం కుదురుతుంది వర్కింగ్ ఉమెన్‌కి. పొద్దున్నే పిల్లలకు టిఫిన్ పెట్టేసి, ఇంట్లో పనులు చక్కబెడుతుంది నర్మద ఓ వైపు వంట చేస్తూనే.

చేతిలో ఉన్న రిమోట్‌తో టీవీలో వచ్చే పలు రకాల ఛానల్స్‌ని మార్చి మార్చి చూస్తున్న సుధీర్‌ని చూస్తూ "పిల్లలేరి" అడిగింది నర్మద.

ఎండలోంచి రావడం వలన ముఖమంతా కందిపోయి, చెమటలు కారుతోంది.

ఆమెవైపోసారి అభావంగా చూసి "ఏమో!"

**ఆంధ్రభూమి దినపత్రిక ఉగాది కథలపోటీలో ఎంపికైన రచన**

అన్నాడు సుధీర్.

"మీతో చెప్పకుండానే బయటకెళ్లారా!" అంది ఒళ్లు మండిన నర్మద.


ఏదో గుర్తొచ్చినట్లుగా బుర్రగోక్కొని "ఆ... అన్నట్లు మరచిపోయాను. మన వీధి చివర ఇంట్లో ఎవరో కొత్తగా అద్దెకు దిగారట. వాళ్ల పిల్లలతో ఆడుకుంటామని వెళ్లారు" బుర్రగోక్కుంటూ చెప్పాడు సుధీర్.

"వీళ్ల ఆటలకి వేళాపాళా లేదా! రాన్రాను బుద్ధి పెరగవలసింది పోయి మరింత తరిగిపోతోంది" చిర్రుబుర్రులాడింది నర్మద.

అంతలోనే ఆమెలోని అమ్మ మనసు తల్లడిల్లింది.

"వెర్రి వెధవలు ఎప్పుడో పొద్దున్న తిన్న నాలుగిడ్లీలు తప్ప మరేం లేవు కడుపులో. ఆటలుంటే అన్నం నీళ్లు అక్కరలేదు. వెళ్లి వాళ్లని పిలుచుకురండి" పిల్లల మీద ప్రేమ పొంగుకొచ్చింది నర్మదకి.

"నేనా! వాళ్లెవరో నాకు తెలియదు. పరిచయం లేని వాళ్లింటికి నేనెలా వెళ్తాను. వాళ్లే వస్తారులే" తేలిగ్గా చెప్పేశాడు సుధీర్.



అతడిలా ఊరుకోలేకపోయింది నర్మద. చీర సరిచేసుకుని తలపై పైన మునివేళ్లతో దువ్వుకుని చెప్పులు తొడుక్కుని వారి కోసం బయలుదేరింది.

నెమ్మదిగా ఆ ఇంటి గేటు తీసుకుని లోపలికి ప్రవేశించింది నర్మద.

తన పిల్లలున్న చోట, ఏదో బహిరంగ సభ జరిగినంత సందడిగా ఉంటుందన్న నర్మద అభిప్రాయం ఆ క్షణంలో పనికి రాలేదు.

"ఏమండీ" గుమ్మం బయటే నిలబడి పిలిచింది బిడియంగా.

"ఎవరూ" ఒకతను కర్టెన్ తొలగించి బయటకు వచ్చాడు.

"మేమీ వీధిలోనే ఉంటున్నాం. మా పిల్లలు మీ పిల్లలతో ఆడుకుంటామని వచ్చారు" చెప్పింది నర్మద.

"ఓ.. సునీల్, వినీల్ మీ పిల్లలా. చాలా యాక్టివ్. లోపలికి రండి" అంటూ ఆహ్వానించి "నీలూ.. ఓయ్ నీలూజీ ఇలారా" అంటూ కిచెన్‌లోకి తొంగి చూస్తూ కేకేశాడు.

రాలుగాయిల్లాంటి తన పిల్లల్ని అభినందిస్తున్న అతడివైపు వింతగా చూస్తున్న నర్మద ఉలిక్కిపడింది ఒక్కసారిగా.

'నీలు' కొంపదీసి తమ ఆడ బాస్ కాదు కదా! రెండ్రోజులుగా లీవ్‌లో ఉంది మహాతల్లి. ఈ ఇంట్లోకి మారడానికేనా లీవ్ పెట్టింది! అయినా ఆవిడకి మాత్రమే నీలిమనే పేరుంటుందా! ఆంధ్ర దేశంలోని అనేకమంది అతివలు అదే నామధేయాన్ని కలిగి ఉండవచ్చు.

నర్మదలో ఆలోచనలు గజి బిజి సాలిగూళ్లలా అల్లుకుంటూంటే-

"ఎవరూ" తడి చేతులు నాప్‌కిన్‌తో తుడుచుకుంటూ బయటకు వచ్చిందో వ్యక్తి.

ఆవిడని చూస్తూనే నర్మద కొయ్యబారిపోయింది. ముఖం పెంకుముక్కలా నల్లబడింది. ఆమె ఊహ నిజమైంది.. ఆమే.. నీలిమ... నర్మద ఆఫీస్‌ను కర్కశంగా ఏలే అధికారిణి.

చచ్చాంరా దేవుడా.. ఈవిడేంటి ఇంత సడెన్‌గా ఎంట్రీ ఇచ్చిందీ.

ఇల్లుపీకి పందిరేసే తన పిల్లల్ని చూసి ఇలా పెంచినందుకు ఎంత క్లాస్ తీసుకుంటుందో!

"గ౦..గుడ్ వ మార్నింగ్ మేడమ్" గుండెలు పీచు పీచుమంటూండగా విష్ చేసంది నర్మద.

"ఓ నర్మదా.. మై గుడ్‌నెస్.. నువ్వేంటి ఇక్కడ? ప్లీజ్ కమిన్" సాదరంగా ఆహ్వానించింది నీలిమ.

"థాంక్యూ మేడమ్" లోపలికి ప్రవేశించింది నర్మద. ఆమె కళ్లు అదే పనిగా తన సంతానాన్ని అన్వేషిస్తున్నాయి.

"కూర్చోండి" మెత్తగా పలికి, భర్త వైపు తిరిగి "శంకూ.. మీట్ మిసెస్ నర్మద, మా ఆఫీసులోనే వర్క్ చేస్తున్నారు. చాలా ఎఫిషియెంట్ వర్కర్" చెప్పింది నీలిమ.

కరుకుగా తనని మందలించే ఆమె నోటి వెంట, తనని గురించిన ప్రశంసలు వెలువడటంతో విస్తుపోయింది నర్మద.

ఆఫీసులో ఆడపులిలా గర్జిస్తూ అదరగొట్టే నీలిమ.. ఇలా ఇంత శాంతంగా..

కుర్చీలో ఇబ్బందిగా కదులుతున్న నర్మదను గమనిస్తూ, ఆమె అంతరంగాన్ని చదివినట్లుగా "నర్మదా.. దిసీజ్ నాట్ అవర్ ఆఫీస్. బీ ఫ్రీయార్" అంది నీలిమ స్నేహపూర్వకంగా ఆమె భుజం మీద చేయి వేస్తూ.

నర్మద నమ్మలేనట్లుగా చూసింది. కళ్లతోనే నవ్వింది నీలిమ.

"చెప్పండి.. ఏం తీసుకుంటారు?" అడిగింది నవ్వు ముఖంతో.

"అబ్బే ఏం వద్దండీ. మీరిలా వచ్చారో లేదో అప్పుడే ఆటలకి వచ్చేశారు మా పిల్లలు. వాళ్ల కోసం వచ్చాను" తలదించుకు చెప్పింది నర్మద.

"ఆహా.. వాళ్లు మీ పిల్లలా. చక్కగా కలసిపోయారు" అభినందించింది నీలిమ.

"అల్లరి చేస్తూ మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారా?"

మొహమాటంగా అడిగింది నర్మద.

"నో...నో.. అదేం లేదు. అయినా పిల్లలు అల్లరి చేయకపోతే మీరు, నేను చేస్తామా! వాళ్ల అల్లరే ఇంటికి అందం, ఆకర్షణ. వాళ్లేం చేస్తున్నారో మీరూ చూడండి" అంటూ పిల్లల గది తాలూకు కర్టెన్ తొలగించింది.

వినీల్ తన వయసే ఉన్న ఒక అబ్బాయితో చెస్ ఆడుతూ ఉంటే సునీల్ ఇంకొక చిన్న అమ్మాయితో కలిసి కామిక్స్ చదువుతున్నాడు.

వీళ్లు తన పిల్లలేనా వీళ్లకి ఇంత కుదురెలా వచ్చింది? నివ్వెరపోయింది నర్మద. ఆమెను చూసి "అమ్మా" అని ఓసారని తిరిగి తమ పనిలో మునిగిపోయారు.

"భోజనాలకి రండి" పిలిచింది నర్మద.

"వన్ మినిట్ అమ్మా" చదరంగంలో ఎత్తు వేయడం కోసం దీక్షగా యోచిస్తున్న వినీల్ అన్నాడు.

"అయిపోగానే వచ్చేస్తారు. మీరలా కూర్చోండి. నేను కూర కలిపేసి వస్తాను" కిచెన్‌లోకి వెళ్లి రెండు నిమిషాలలో తిరిగి వచ్చింది నీలిమ.

## ఇదో రకం కోపం!

*ఎవరికైనా కోపం తారాస్థాయికి వెళ్లిందనుకోండి... చాలావరకు జనాలు చేతికి అందుబాటులో వున్న ఏ వస్తువునైనా విసిరికొట్టడడం, పగలగొట్టడం లాంటివి చేస్తారు కదా! కుర్ర హీరోయిన్ హన్సిక మాత్రం అలా చేయదట. తనకి గనక కోపం బాగా వస్తే వెంటనే రూంలోకి వెళ్లిపోయి చకచకా చేతికొచ్చిన బొమ్మలు గీసిపారేస్తుందిట. ఏంటి మీరు ఆర్టిస్టా? అంటే- అబ్బే అదేం లేదు. నాకసలు బొమ్మలు గీయడం సరిగ్గా రానే రాదు, కానీ కోపం వస్తే అలాగే చేస్తాను, అదేంటో మరి' అని ముసిముసిగా నవ్వేస్తుంది.*

"ఇంట్లో వంట అదీ మీరే చేస్తారా?" అడిగింది నర్మద.

"ఆహా... నిక్షేపంగా. ఏం మీ ఇంట్లో వంట మీరు చేయరా" నవ్వుతూ ప్రశ్నించింది నీలిమ.

"అహ.. అది కాదు.. ఆఫీసరైయుండి" మాటలు మింగేసింది నర్మద.

చుట్టూ దాసదాసీ జనం చేత సేవలు చేయించుకుంటూ మహారాణిలా వైభోగాలనుభవిస్తూ దర్జాగా ఉంటుందని తను ఊహించిన నీలిమ ఇలా... నిరాడంబరంగా సామాన్య గృహిణిలా...

"ఆఫీసర్‌నైనా ఆడదాన్నే కదా" అంది నీలిమ నవ్వుతూ.

"అంటే ఇంట్లో పనంతా మీరే చేస్తారా?"

"చిన్న సవరణ.. నేను కాదు మేము. యస్...నేను, మా వారు, పిల్లలు... అందరం కలిసి చేసుకుంటాం. అందుకే ఎంత పనైనా చిటికెలో అయిపోతుంది" నర్మద సందేహాన్ని తీర్చింది నీలిమ.

ఆమెతో మాట్లాడుతూనే ఇంటినంతా పరికించి చూసింది నర్మద. ఇల్లంతా ముత్యంలా, పరిశుభ్రంగా ఉంది. ఎక్కడి వస్తువులక్కడ నీట్‌గా సర్ది ఉన్నాయి. ఇద్దరు పిల్లలు ఆ ఇంట్లో ఉంటున్న ఛాయలే లేవు.

ఇంతలో నీలిమ భర్త లోపలి నుండి జ్యూస్ గ్లాసులతో వచ్చాడు.

"మొదటిసారి మా ఇంటికి వచ్చారు. తీసుకోండి" అంటూ అందించాడు మర్యాదపూర్వకంగా.

"శంకూ.. ఆరెంజ్ జ్యూస్ చాలా బాగుంది" చెప్పింది నీలిమ భర్తవైపు మెచ్చుకోలుగా చూస్తూ.


"థాంక్యూ మేమ్ సాబ్" తలవంచి అభివాదం చేశాడు అతడు.

ఏమాత్రం భేషజం లేకుండా పురుషాధిక్యతను ప్రదర్శించకుండా ఇంటికొచ్చిన అతిథికి మర్యాద చేసిన అతడి సంస్కారానికి ముగ్ధురాలైంది నర్మద.

మనసులో ఏ మూలో కాస్తంత అసూయ తొంగి చూసింది. అదీ కొద్దిసేపే. వెంటనే సర్దుకొని "మీరు చాలా లక్కీ నీలిమగారూ. మీ కుటుంబ సభ్యులు అన్ని విషయాలలోనూ చక్కగా కోపరేట్ చేస్తున్నట్టున్నారు" అంది నర్మద.

"ఏం నర్మదా.. మీ వారు, పిల్లలు మీకు హెల్ప్ చేయరా?" ఆశ్చర్యంగా అడిగింది నీలిమ.

ఆ అడగడంలో ఏదో ఆత్మీయ భావన ధ్వనించింది. ఆమె తనకెంతో దగ్గరి వ్యక్తి అన్న ఫీలింగ్ కలిగింది నర్మదకు. అందుకే తన మనసులో వేదనను వెల్లడించింది. నీలిమ వదనంలో గాంభీర్యం చోటు చేసుకుంది.



"ఉద్యోగస్తురాలైన వనిత ఇంట బయట తన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలంటే ఆమెకు ఇంట్లో వారి అండదండలు, సహాయ సహకారాలు ఎంతో అవసరం. అవి లభించనప్పుడు ఆమె రెండు పడవల ప్రయాణం చేయలేక నానా అవస్థ పడుతుంది. మీరెప్పుడూ మీ వారితో మీ సమస్యను గురించి డీప్‌గా డిస్కస్ చేయలేదా?" అడిగింది నీలిమ.

"చేయకేం? చాలాసార్లు చెప్పి చూశాను నాకు సహాయం చేయకపోయినా ఫరవాలేదు ఎవరి పనులు వాళ్లని చేసుకోమని. అయినా వినరు. ఆయన నా పట్ల కనబరిచే నిరాదరణే పిల్లలకూ అలవాటైంది" వేదనాభరిత హృదయంతో చెప్పింది నర్మద.

"అయాం సారీ నర్మదా. వాళ్లిలా తయారవ్వడం వెనుక మీ పాత్ర ఉందని చెప్పక తప్పడం లేదు" అంది నీలిమ.

"నా పాత్రా! అదెలా?" నిర్ఘాంతపోయింది నర్మద.

"ఇంటి పనులు చేసుకోవడం గృహిణి బాధ్యత. కాదనను. రెండు బిందెలను కావిడి మీద మోసే వాడికి, బాలెన్స్‌డ్‌గా నడవడం చాలా అవసరం. అవసరానికి మించిన భారం మోస్తే ఆ కావిడి బద్ద వంగిపోవడంతో పాటు, మోసే వాడికీ అసౌకర్యంగా ఉంటుంది. కావిడి విరిగిపోయే ప్రమాదమూ లేకపోలేదు. యామై రైట్" అడిగింది నీలిమ.

"నిజమే.. కానీ శక్తి మించిన భారం మోయవలసి వస్తోంది నాకు"

"నర్మదగారూ.. మీ అందరికీ అనిపించవచ్చు.. ఆఫీస్‌లో నేను చాలా స్ట్రిక్ట్‌గా ఉంటూ మీ అందరితోనూ కర్కశంగా వ్యవహరిస్తానని. కానీ ఆఫీస్ స్టాఫంతా సిన్సియర్‌గా వర్క్ చేయాలంటే ఆపాటి కమాండింగ్ తప్పనిసరి. రౌతు మెత్తనైతే గుర్రం మూడు కాళ్లతో నడిచిందన్న సామెత మీరు వినే ఉంటారు. ఆఫీస్ అనే అశ్వానికి అధికారిగా పనిచేసే వ్యక్తి మంచి రౌతు అయ్యుండాలి. అప్పుడే అందరూ తమ తమ బాధ్యతలెరిగి మసలుకుంటారు. లేకపోతే ఆఫీసర్ మెతకతనాన్ని అలుసుగా తీసుకొని నెత్తెక్కి తాండవం చేస్తారు. ఏమంటారు?"

ఆమె అభిప్రాయం కోసం వేచి చూసిన నీలిమ, నర్మద ముఖంలోని భావాలను గమనించి తిరిగి కొనసాగించింది.

"ఇంటి విషయమైనా అంతే. పంచకళ్యాణి లాంటి సంసారమనే అశ్వానికి సుశిక్షితుడైన రౌతు లాంటిది ఇల్లాలు. కుటుంబ సభ్యులపై ప్రేమను కురిపిస్తూ వారికేం కావాలో చూసుకుంటూ తద్వారా వారి అభిమానాన్ని, అనురాగాన్ని చూరగొనడం ఒక గృహిణిగా ఆమె విధి. కానీ వాళ్లూ తన

ఇబ్బందుల్ని గుర్తించి తనకు సహకరించేలా మలచుకోవాలి వారిని. అవసరమైతే కాస్త కరుకుగా వ్యవహరించాలి. అలాగని వాళ్లతో తగువులాడమని ప్రేరేపించడం లేదు. సామరస్య ధోరణిలోనే పనులు సానుకూలం చేసుకోవాలి. అప్పుడే ఆమె తన వృత్తి బాధ్యతలకు న్యాయం చేయగలదు"

నర్మద సమస్యని ఇంకా వివరంగా చర్చిస్తూ జ్ఞానోపదేశం గావించింది నీలిమ. తనేం చేయాలో అర్థమైంది నర్మదకు. కర్తవ్య బోధ చేసిన ఆమెకు కృతజ్ఞతలు తెలిపి ఇంటిదారి పట్టింది.

○○○

"నా స్కూల్ యూనిఫారం ఏదీ?" స్కూల్ బస్ వచ్చే వేళ అయిపోతోందనంటూ చిందులు తొక్కుతున్న వినీల్ అరిచాడు గట్టిగా. అతడితో స్వరం కలిపాడు సునీల్.

"ఏమో! నాకు తెలియదు" బాక్సులు సర్దుతున్న నర్మద పెదవి విరిచింది.

"నిన్న సన్ డే కదా! ఉతికి ఇస్త్రీ చేయలేదా!" విసుగ్గా అన్నాడు వినీల్.

"ఉన్నవి రెండే చేతులు. వాటితోనే సమస్త కార్యాలు చక్కపెట్టడానికి నేనేం సవ్యసాచిని కాదు. పైగా నాకు దొరికేదే వారానికో సన్‌డే. నా ఒంట్లోనూ అంత బాగు లేదు. ఇక మీదట మీరు నాకు హెల్ప్ చేస్తేనే మీ పనులు చేస్తాను. లేకపోతే ఎవరి పనులు వారు చేసుకోండి. అంతేకాదు ఇకపై మీరిద్దరూ తన్నుకోవడానికి కూడా వీల్లేదు" నిక్కచ్చిగా చెప్పిన ఆ మాటల్లో ఏదో పదును కనిపించింది పిల్లలకి.

"మరెలా? నాన్‌యూనిఫాంలో వెళ్తే మా మిస్ పనిష్ చేస్తుంది" జోరు తగ్గిన వినీల్ గునిశాడు చిన్నగా.

"ఇవాల్టికి మరంతే" ఏమీ చలించకుండా చెప్పేసి తన పని తాను చేసుకోసాగింది.

కిక్కురుమనకుండా వెళ్లారు వాళ్లు.

సాయంత్రం నర్మద ఇంటికొచ్చేసరికి మూలమూలల మూడు రోజులుగా మూలుగుతున్న స్కూల్ యూనిఫామ్‌లన్నింటినీ ఏరి పోగు చేసుకుని కూర్చున్నారు పిల్లలు.

ఇల్లు అద్దంలా నీట్‌గా లేకపోయినా రోత పుట్టించేంత అపరిశుభ్రంగా మాత్రం లేదు.

"అమ్మా.. ఇవాళ యూనిఫామ్ వేసుకోలేదని మా మిస్ మా చేత వందేసి గుంజిళ్లు తీయించింది. కాళ్లు నొప్పులెట్టాయి. నువ్వు వీటిని మిషన్‌లో వేసి ఉతికేస్తే మేం ఆరేస్తాం" కోరస్‌గా పలికారు ఇద్దరూ.

ఫరవాలేదు తానిచ్చిన డోస్ బాగానే పనిచేసింది. నవ్వుకుంది నర్మద.

బట్టలు ఉతికేసి, వాళ్లని పిండి ఆరేసుకోమంది. శాంపిల్‌గా ఎలా ఆరేయాలో చేసి చూపించింది.

"విష్ణు కూడా వాళ్ల మమ్మీకి ఇలాగే హెల్ప్ చేస్తాడట తెలుసా?" ఉత్సాహంగా చెప్పాడు వినీల్.

విష్ణు అంటే నీలిమ కొడుకని అర్థమైంది నర్మదకు.

మ్యాగీ నూడిల్స్ చేసి ప్లేట్స్‌లో అమరుస్తూ "మంచి పిల్లలైతే అమ్మకు హెల్ప్ చేస్తారట" అంది నర్మద ఓరగా వాళ్లని చూస్తూ.

"మేం మంచి పిల్లలమే" కూడబలుక్కున్నట్లుగా అన్నారు వాళ్లు.

"వెరీగుడ్. అందరి చేత అలాగే అనిపించుకోవాలి" మెచ్చుకుంది నర్మద.

వంటపని పూర్తి చేసి పిల్లలకు పెట్టేసి, రూమ్‌లోకి వెళ్లి ఈజీ చైర్‌లో కూర్చుని మనసుకి నచ్చిన పుస్తకం తెరిచింది. అందులో లీనమైన తరువాత ప్రశాంతంగా అనిపించింది ఆమెకు.

సుధీర్ రావడం, భోజనాలు పూర్తవ్వడం, చూసినంతసేపు టీవీ చూసి గదిలోకి రావడం అన్నీ యథావిధిగా జరిగిపోయాయి.

పక్కమీద వాలబోతూ తలగడ మీద తడితువ్వాలుని గమనించి "ఛీ..ఛీ.. ఇక్కడిదేంటి? పక్కంతా ఒకటే వాసన కొడుతోంది. ఏ గాడిద దీన్నిక్కడ పడేసింది?" రంకె వేశాడు అసహనంగా.

"ప్రొద్దున్న మీరే దాన్తో తుడుచుకున్నారు" పుస్తకం మీద నుండి దృష్టి మరల్చకుండానే చెప్పింది నర్మద.

"అయితే మాత్రం దీన్ని తీసి ఆరేస్తే నీ సొమ్మేం పోతుంది!"

"పోతుంది.. సొమ్ము కాదు. ఒంట్లోని ఓపిక. చూడండి.. దాన్ని వాడింది మీరు. తీసి ఎండలో ఆరేసే బాధ్యత కూడ మీదే" చెప్పింది నర్మద.

మింగేసేలా చూశాడు సుధీర్.

"మరొక్క విషయం.. రాన్రాను నాకూ శక్తి తగ్గిపోతోంది. అడ్డమైన చాకిరీ చేసే ఓపిక నాకు లేదు. ఇక మీదట ఎవరి పనులు వాళ్లు చేసుకుంటే మంచిది. ఈ మాట ఒక్కసారి చెప్తే అర్థం చేసుకునే ఇంగితం మీకుందనే అనుకుంటున్నాను" కూల్‌గా చెప్పేసి అటు తిరిగి పడుకుంది నర్మద.

ఆమె మాటలలో ఇదివరకటి అభ్యర్థన లేదు. అతడికి మాత్రమే వినిపించి, అర్థమయ్యే ఆజ్ఞ ఉంది. అలాంటి కరుకుతనం గతంలో ఎన్నడూ ధ్వనించలేదామె స్వరంలో.

నర్మదేనా ఇలా మాట్లాడుతోంది! ఆలోచనలో పడ్డాడు సుధీర్.

నర్మద నిశ్చింతగా ఊపిరి పీల్చి వదిలింది. ఈమాత్రం చాలు.. ఆలోచనా జ్ఞానం ఉన్న వాడెవడైనా స్పందించడానికి.

అతడిలోనూ, పిల్లలలోనూ మార్పు తెచ్చి తను సుఖపడి వాళ్లని సంతోషపెట్టాలన్న సదుద్దేశ్యంతోనే తానిలా ప్రవర్తిస్తున్నది. సహజంగా మెత్తనైన తన స్వభావాన్ని కర్కశంగా మార్చుకునే కఠోర నిర్ణయం తీసుకున్నది కూడా అందుకే. అసలు మారాల్సింది తనే. వాళ్లు కాదు.

హఠాత్తుగా వచ్చిన ఈ మార్పును జీర్ణించుకోవడానికి వాళ్లకి కాస్త సమయం అవసరం. అప్పటివరకూ తను నిగ్రహంగా వ్యవహరించాలి. వారిలో పరివర్తన అనేది రాత్రికి రాత్రి కలగదు కాబట్టి తను కొన్నాళ్లపాటు వేచి ఉండాలి.

భర్త, పిల్లలలో మార్పు రావాలని ఆకాంక్షిస్తూ రేపటి ఉదయం కోసం ఆశగా నిరీక్షిస్తూ తృప్తిగా కళ్లు మూసుకుంది నర్మద.

○

## ఇలియానా రూటే వేరు!

తెరపై ఇలియానా గెటప్పులు చూసినవాళ్లెవరైనా సరే ఆమెకి నగలు, ఆభరణాల్లాంటి వాటిమీద మోజు వుంటుందా అనే సందేహం కలుగుతుంది. కానీ ఇలియానాకి మాత్రం సంప్రదాయమైన గెటప్పులో ఫంక్షన్లకి వెళ్లడం అంటే భలే ఇదట. ఎంచక్కా రంగురంగుల చీరలు కట్టుకుని, వంటి నిండా బంగారునగలు వేసేసుకుని పెళ్లిళ్లకీ వ్రతాలకీ వెళితే ఆ కళే వేరు అంటుంది ఇలియానా. నిజమే!

